ప్రజాశక్తి

శుక్రవారం 21 జూన్ 2024 5 విజయనగరం

మంత్రులిద్దరికీ అభినందనలు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికై, మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణికి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రులిద్దరూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ తరపున మంత్రులకు సంపూర్ణ సహకారం అందిస్తామని, వారు కూడా జిల్లా ప్రజా పరిషత్ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలను అందించాలని ఆ ప్రకటనలో కోరారు. జిల్లాను అన్ని విధాల అభివృద్ధిపథాన నడిపించడానికి, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ప్రతినిధులంతా ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మద్దతుధరలో మోసం

వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించడంలో కేంద్రంలోని బిజెపి సర్కారు మరోసారి మోసం చేసింది. అన్ని రకాల ఉత్పత్తులపైనా ధరలు పెంచినట్టుగా చెప్పుకుంటున్నప్పటికీ, పెంచిన మొత్తం గత ఏడాదితో పోలిస్తే అత్తెసరే. గతంలో పెంచిన ధరతో పోలిస్తే వరిపై రూ.26 తగ్గడం గమనార్హం. వ్యవసాయ పెట్టుబడులు మాత్రం అమాంతంగా పెరిగిపోయాయి. వ్యవసాయ ఉత్పత్తులపై 50శాతం అదనంగా పెంచి, దానిపై మద్దతు ధర ప్రకటించాలన్న స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా విస్మరించింది.

ఐదేళ్లలో కేంద్రం పెంచిన మద్దతు ధర వివరాలు

సంవత్సరం	పెంపు (రూ.లో)	సాధారణ రకం వరి క్వింటాకు (రూ.లో)
2020-21	53	1868
2021-22	72	1940
2022-23	100	2,040
2023-24	143	2,183
2024-25	117	2,300

- వరికి క్వింటాకు రూ.117 మద్దతు ధర పెంపు
- గతేడాది పోలిస్తే రూ.26 తక్కువ
- పెరిగిన వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలు
- తడిసిమోపడవుతున్న పంట ఖర్చులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా ఏటా 4, 52,685 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా 3,01,247 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు పంటలు ఉన్నాయి. ఇందులోనూ 2,34,550 ఎకరాల్లో వరి సాగు ఉంది. తద్వారా 4.82లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ ఏడాది ఉత్పత్తి అవుతాయని అధికారులు అంచనా రూపొందించారు. వరితో పాటు మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటితుడుపూ కరువే అన్నట్టుగా ఉంది. గత ఏడాది (2023-24) సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2183, ఎగ్రేడ్ రూ.2,203 చొప్పున మద్దతు ధర అమలు చేశారు. అంతకు ముందు (2022-23)తో పోలిస్తే గత ఏడాది సాధారణ రకంపై రూ.143, ఎ-గ్రేడ్ వరిపై రూ.163 చొప్పున పెంచారు. తాజాగా 2024-25 ఏడాదికి సంబంధించి కేంద్ర ప్రకటన ప్రకారం సాధారణ రకం ధాన్యం రూ.2,300, ఎ-గ్రేడ్ రూ.2,320 మాత్రమే. దీన్నిబట్టి ఈ రెండు రకాల ధాన్యంపై పెంచింది కేవలం రూ.117 మాత్రమే. గతంతో పోలిస్తే పెంచిన మద్దతు ధర రూ.26 తక్కువే. మొక్కజొన్నపై కూడా కేవలం రూ.135, పత్తిపై రూ.501 చొప్పున మాత్రమే పెంచారు.

ఈ నేపథ్యంలో పెరిగిన వ్యవసాయ పెట్టుబడులను ఒక్కసారి పరిశీలిస్తే.. ట్రాక్టర్ దుక్కులు, నీటి ఇంజన్లకు ఉపయోగించే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుపై రూ.10 నుంచి రూ.15 వరకూ పెరిగాయి. ఫలితంగా వీటి అద్దెలు పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ కూలి రేట్లు కూడా పెరిగాయి. వీటికితోడు విత్తనాలు, ఉబాలు, ఎరువులు, పురుగుల మందులు, గాబుదీతలు, కోతలు, నూర్పులు తదితరాలకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.55వేల వరకు ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఇది గత ఏడాది పోలిస్తే రూ.5వేలు నుంచి రూ.7వేలు పెరిగినట్టేనని అంటున్నారు.

వాస్తవానికి క్వింటా విత్తనాల సాగుకు రూ.2,150 ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు ఉన్నాయి. ఈ విధంగా పరిశీలిస్తే క్వింటాకు మద్దతు ధర రూ.3,100 వరకు చెల్లించాల్సివుంది. ప్రభుత్వం వాస్తవ పెట్టుబడులు, దిగుబడులు మసిబూసి మారెడుకాయ చేసిందన్న విషయం స్పష్టంగానే అర్థమౌతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ఏమాత్రమూ సరిపోయే పరిస్థితి లేదు.

స్వామినాధన్ సిఫార్సులు ఏం చెబుతున్నాయి

స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వరిసాగుకు అయ్యే మొత్తం మదుపుపై అదనంగా 50శాతం శాతం కలిపి దానిపై మద్దతు ధర ప్రకటించాల్సివుంది. తద్వారా రైతుల కష్టానికి ఫలితం దక్కుతుందనేది ఆ కమిషన్ వాదన. ఈ సిఫార్సులను పక్కనబెట్టిన కేంద్రం కంటితుడుపు ధరలు ప్రకటించి దాన్నే గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. పిఎం కిసాన్ పేరిట దేశంలోని ప్రతి గ్రామంలోనీ ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నట్టు ప్రచారం చేసుకున్న కేంద్రం రైతులకిస్తున్న రూ.6వేల సాయాన్ని పెంచలేదు. కేవలం పెంచిన ధరనే గొప్పగా చెప్పుకుంటోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీసం స్పందించకపోవడం గమనార్హం.

రైతులకు నమ్మక ద్రోహం

ఢిల్లీలో సుదీర్ఘకాలం పాటు సాగించిన రైతు ఉద్యమంలో స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. గతిలేని పరిస్థితుల్లో దిగివచ్చిన కేంద్రం రైతులకు ఆమోదయోగ్యమైన ధర కల్పిస్తామనిహామీ ఇచ్చింది. బోనస్ కూడా ఇస్తామని నమ్మబలికారు. ఆచరణ ఆ మాట నిలబెట్టుకోలేదు.

– బుద్ధరాజు రాంబాబు
జిల్లా కార్యదర్శి, ఎపి రైతుసంఘం

ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నీట్ పరీక్ష నిర్వహణపై

సమగ్ర విచారణ చేపట్టాలి

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలి • ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి బాలాజీ జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలాజీ జంక్షన్ వద్ద మానవహారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలు వస్తున్నాయన్నారు. అదే సెంటర్లో ఎగ్జామ్ రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయని, ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉండగా 720/720 ఎలా వచ్చాయంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయన్నారు. ఎంతో మంది విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయని ప్రశ్నించారు. నీట్ ఎగ్జామ్ వివాదంపై ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వివరణ ఇస్తూ పరీక్షలో సమయం కోల్పోయినట్లు నివేదించిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల 718, 719 మార్కులు వచ్చాయని, మరియు ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయి అందువల్ల రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించి.. 44 మంది అభ్యర్థుల మార్కులు 715 నుంచి 720కు పెరిగాయని వివరించిందన్నారు. కానీ కొంత మంది విద్యార్థులకు 100 పైగా గ్రేస్ మార్కులు కలిపారన్నారు. ఇదిలా వుంటే మొదటి సారి జూన్ 14న ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి, ఎన్నికల కౌంటింగ్ రోజున (జూన్ 4) పరీక్షా ఫలితాలు విడుదల చేయటంతో ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నీటిపైనా విచారణ జరిపించాలని, పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందినందుకు ఈ ఏజెన్సీ ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జె రవి, ఉపాధ్యక్షులు సమీరా, నాయకులు రమేష్, సోమేశ్, గుణ రాజు, భారతి, వెంకటరమణ, దుర్గాప్రసాద్, అక్షయ్, వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి : నీట్ పరీక్షలో అవినీతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, డివిజన్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, ప్రవీణ్, వంశీ పాల్గొన్నారు.

బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో పనులపై ఆరా తీస్తున్న జిఎం పరమేశ్వర్

అభివృద్ధి పనులు పరిశీలించిన రైల్వే జిఎం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పన్వాల్ గురువారం పరిశీలించారు. విశాఖ నుంచి విజయనగరం మీదుగా బొబ్బిలి, పార్వతీపురం, ధమన్‌జోడీ, కోరాపుట్ వరకు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. విజయనగరం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరాలను స్టేషన్ మాస్టర్ మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ రావు, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయ్ రావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నీటి కోసం పాట్లు

ఆరు రోజులుగా నిలిచిన సరఫరా • ప్రజలకు తీవ్ర ఇక్కట్లు

ట్యాంకర్ దగ్గర నీరు పట్టుకుంటున్న జనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఆరు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు వాటర్‌ప్లాంట్లపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. కంటోన్మెంట్, బాలాజీ నగర్, కొత్త అగ్రహారం, విటి అగ్రహారం, వుడా కాలనీ తదితర ప్రాంతాలకు ముషిడిపల్లి నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. కొర్లాం జంక్షన్ నుండి గొట్లాం వరకు రహదారి నిర్మాణం జరుగుతోంది. టోల్ గేటు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో పైపు లైను పనులు జరగడంతో నగరంలోని 37,38,39,40,41,43,44,46, 47 డివిజన్లలో తాగునీటి సరఫరాకు నాలుగు రోజులు పాటు అంతరాయం కలుగుతుందని నగర పాలక సంస్థ అధికారులు ప్రకటన విడుదల చేశారు. కానీ ఆరు రోజులైనా నీటి సరఫరా పునరుద్దరణ కాలేదు. దీంతో నగరంలో ప్రధానంగా 10 డివిజన్లకు సంబంధించి ప్రజలు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. సరఫరా నిలిచిన రోజుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని నగర పాలక సంస్థ అధికారులు ప్రాంతాల వారీ సమయం తెలియచేసినా సక్రమంగా అమలు కాలేదు. దీంతో ఆయా వార్డుల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం పనులు మానుకొని ఉంటే తప్ప నీరు దొరికే పరిస్తితి లేదు. మరో వైపు కొత్త పేట నీళ్ల ట్యాంక్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ప్రధానంగా నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరు కూడా నగర వాసులుకు అందడం లేదు. ఆరు రోజులుగా నీరు సరఫరా లేకపోయినా అధికారులు,నగరపాలక సంస్థ పాలకులకు చీమ కుట్టినట్లు లేకపోవడం దారుణం. నగర పాలక సంస్థ పాలకవర్గం ఉందా లేదా అనే అనుమానం ప్రజల్లో కలుగుతుంది.

జేబులు నింపుకుంటున్న నీటి వ్యాపార సంస్థలు

ఇదిలా ఉంటే ఇదే అదునుగా నీటి వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారు. ఆరు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో ప్రతి వాటర్ టిన్ దగ్గర రేటు పెంచి అమ్మకాలు చేస్తున్నారు. టిన్‌కు రూ.5 నుంచి రూ.10కు పెంచేశారు. దీంతో నగరంలో ఉన్న వాటర్ ప్లాంట్లు వ్యాపారం జోరందుకుంది.

ఐఆర్‌సిటిసి టూర్ ప్యాకేజీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ తీర్థ, విహారయాత్రలకు టూర్ ప్యాకేజీలలో అందిస్తున్నామని ఐఆర్‌సిటిసి ప్రతినిధులు వెల్లడించారు. గురువారం విజయనగరం రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ప్యాకేజీ వివరాలను వెల్లడించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పలు ప్రదేశాలకు అందజేస్తున్న టూర్ ప్యాకేజీలు ఎయిర్ ప్యాకేజీలను వివరించారు. తిరుపతి బాలాజీ దర్శన్, సదరన్ డివైన్ టెంపుల్ టూర్ రాయల్ రాజస్థాన్ లేహ్/లడఖ్, థాయిలాండ్ టూర్ ఎయిర్ ప్యాకేజీల అందుబాటులో ఉన్నాయన్నారు. జూలై 5న లేహ్ లడక్, ఆగస్టు 14న గుజరాత్, ఆగస్టు 23న థాయిలాండ్, సెప్టెంబర్ 22న అండమాన్ టూర్ల ఎయిర్ ప్యాకేజీలను వివరించారు అయోధ్య కాశీ పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో జూలై 9న ప్రారంభమై 17వ తేదీ వరకు సాగే భారత్ గౌరవ టూరిస్ట్ ట్రైన్ కూడా అందుబాటులో ఉందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యు డబ్ల్యు డాట్ ఐఆర్‌సిటిసి టూరిజం డాట్ కామ్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. సమావేశంలో ఐఆర్‌సిటిసి అధికారిణి డాక్టర్ క్రాంతి, పి. సావర్కర్, ఎగ్జిక్యూటివ్ సంఘమిత్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు అభివృద్ధి చెందేలా సిబ్బంది కృషి చేయాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను విజయవంతంగా నిర్వహించాలి తెలిపారు. జిల్లాలో గల 42 అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రధాన ఉపాధ్యాయులు, ల్యాబ్ నోడల్ టీచర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో డిఇఒ మాట్లాడారు. ల్యాబ్ పని తనాన్ని నిర్ధారించడానికి 13 ఇండికేటర్లు ఇచ్చామన్నారు. సూచికల ఆధారంగా ల్యాబ్ పనితనానికి రేటింగ్ ఇస్తూ పాయింట్లు ఇస్తామన్నారు. ఈ సూచికలన్నీ విజయవంతంగా అమలు చేసిన పాఠశాల ల్యాబ్ కు ఐదు పాయింట్లు ఇస్తామన్నారు. రానున్న రోజులలో ప్రతినెల జిల్లా కలెక్టర్ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారవు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా వి.రమేష్ వ్యవహరించారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

35వ రోజుకు జిందాల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

నిరసన శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

జిందాల్ పరిశ్రమను తెరిపించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరసన శిబిరం గురువారం 35వ రోజుకు చేరింది. తక్షణమే కంపెనీ తెరచి కార్మికులందరికీ బేషరతుగా పని కల్పించాలని కార్మికుల డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, టిఎన్‌టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో సాగునీటి వనరులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు నీరు అందడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విఆర్ఎస్ కాలువ నిర్వహణకు లష్కర్లు లేకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. విఆర్ఎస్ కాలువల నిర్వహణకు 80 మంది ఉండాల్సి ఉన్నా 8 మంది మాత్రమే ఉన్నారన్నారు. విఆర్ఎస్ నీరు గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న స్వామివారి చెరువుకు మినీ రిజర్వాయర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కంచరగెడ్డ, చిత్రకోట బొడ్డవలస, పారాది ఆనకట్టు, వెంగలరాయసాగర్ ప్రాజెక్టు కాలువలకు రూ.10 కోట్లు నిధులు కేటాయిస్తే 10 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. నైరుతి రుతుపవనాలు వచ్చి రెండు వారాలు కావస్తున్నా వర్షాలు కురవకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పారాది ఆనకట్ట పాడైపోవడంతో వేగావతి నది నుంచి వచ్చే నీరు చెరువులకు వెళ్లకపోవడంతో నది ఉధృతంగా ప్రవహించి కాజ్ వే కొట్టుకుపోయిందన్నారు. సాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, నాయకులు యు.నాగభూషణం, రెడ్డి త్రినాథ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట, డెంకాడ

డెంకాడ పోలీసు స్టేషను పరిధిలో 2020లో నమోదైన హత్య కేసులో నిందితుడు బొల్లు వెంకటరావుకు యావజ్జీవ కారాగార శిక్ష , రూ. 2వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈనెల 19న తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. 2020 డిసెంబర్ 14న డెంకాడ మండలం సింగవరం గ్రామానికి చెందిన బావన సురేష్‌ను బావ అయిన బొల్లు వెంకటరావు కుటుంబ తగాదాల నేపథ్యంలో గ్యాస్ సిలిండరుతో బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి అమ్మమ్మ బొల్లు అమ్మాజీ డెంకాడ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయడంతో డెంకాడ పోలీసు స్టేషను అప్పటి ఎస్ఐ సాగర్ బాబు కేసు నమోదు చేయగా, అప్పటి భోగాపురం సిఐ సిహెచ్.శ్రీధర్ కేసులో దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో వెంకటరావుకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ చక్రవర్తి తీర్పు వెల్లడించారు.

విమానాశ్రయ సెక్యూరిటీ క్వార్టర్స్‌కు

భూముల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయ భద్రతా సిబ్బంది నివాసాల కోసం అవసరమైన ప్రభుత్వ భూములను ఆర్‌డిఒ సూర్యకళ పరిశీలించారు. మండలంలోని కొంగవానిపాలెం, రావాడ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. మూడు నెలల కిందట తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూ పరిధిలో భూములను వీటి కోసం కేటాయించారు. ఈ భూములు గతంలో ఫుడ్‌కోర్టు సంస్థకు కేటాయించారని ఆ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో కోర్టు వివాదంలోకి వెళ్లడంతో మరోచోట భూములను పరిశీలించి ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవల మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి వాటి వివరాలు అందజేయాలని ఇటీవలి గ్రామ రెవెన్యూ అధికారులకు తహశీల్దారు సూచించారు. ఈ మేరకు కొంగవానిపాలెం రెవెన్యూలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. అవి అనువుగా లేవని ఆర్‌డిఒ తెలిపినట్లు సమాచారం. సవరవల్లి సమీపంలోని రావాడ జగనన్న కాలనీకి సమీపంలో చిన్న కొండ ఉంది. ఈ భూములను కూడా ఆమె పరిశీలించారు. కొండను చదును చేస్తే ఈ భూములు అనువుగా ఉంటాయని గుర్తించినట్లు తెలిసింది. జాతీయ రహదారికి ఆర కిలోమీటరు దూరంలో ఉండడంతోపాటు విమానాశ్రయానికి వెళ్లేందుకు కూడా అనువుగా ఉంటుందని అధికారులు తెలిపినట్లు సమాచారం. ఈ భూములను విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్‌కు చూపించనున్నారు. వారు ఆమోదం తెలిపిన తరువాత అధికారులు ఓ నిర్ణయానికి వచ్చి వీటిని కేటాయించనున్నట్లు తెలిసింది. తహశీల్దారు శ్యామ్ ప్రసాద్, సర్వేయరు ముదికేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భద్రతా సిబ్బంది కోసం ఆర్‌డిఒ పరిశీలించిన భూములివే

స్కూల్ ఆయాలకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు మూడు నెలల బకాయి వేతనాలు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరుతూ ఎంఇఒకు గురువారం ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నందిని , బేగం, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చే రూ.6వేలు కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జగన్మోహన్ మాట్లాడుతూ పేరుకు పార్ట్ టైం అని చెప్పి ఫుల్ టైం పనిచేస్తున్నారని, నిర్దిష్టమైన పని గంటలు ప్రకటించాలని, లేదంటే ఫుల్ టైం వర్కర్లుగా గుర్తించి రూ. 12వేలు జీతం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్, ఇఎస్ఐ, పిఎఫ్ సిక్ లీవ్‌లు వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి ప్రభుత్వం , స్థానిక ప్రజాప్రతినిధులు ఎలాంటి రాజకీయ బెదిరింపులకు పాల్పడకుండా ప్రస్తుతం పని చేస్తున్న వారందరినీ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పద్మా, గౌరి, ఆదిలక్ష్మి ,మంగమ్మ, లీల, లక్ష్మీ, లత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు

బాధ్యతలు చేపట్టిన మంత్రి కొండపల్లి

చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రోడ్ మ్యాప్ : శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై సంబంధాల శాఖ మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్ రాష్ట్ర సచివాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి కొత్తగా మూడు శాఖలను సమన్వయం చేస్తూ ఏర్పాటు చేసిన ఈ శాఖ ద్వారా రాష్ట్రంలో చిన్న పరిశ్రమల ఏర్పాటు, ఎన్నారైల సహకారంతో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి, డ్వాక్రా గ్రూప్ మహిళల పారిశ్రామిక ఎదుగుదలకు ఒక రోడ్ మ్యాప్ ను త్వరలోనే రూపొందిస్తామని మంత్రి తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావించే ఔత్సాహికులకు ఏ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన వాతావరణం ఉంటుందనే అంశంపై తమ శాఖ ద్వారా తగిన గైడెన్స్ చేస్తామని తెలిపారు. యువత ఎక్కువగా ఉద్యోగాలు పొందే విధంగానే ఆలోచన చేస్తున్నారని, ఎంటర్ ప్రెన్యూర్ గా కూడా మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. ప్రతి జిల్లాలో పారిశ్రామిక వేత్తలకు స్కిల్ సెన్సెక్స్ అందుబాటులో వుంచి వారికి కావలసిన నైపుణ్యత గల మానవ వనరులు ఎంత మేరకు అందుబాటులో వున్నదీ తెలియజేస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రెండు ఫైల్స్ పై సంతకాలు

ఇరవై ఆదర్శ మండలాలకు పది లక్షల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేస్తూ, ఎస్‌సి, ఎస్‌టి ఎస్‌హెచ్‌జిలకు అందుబాటులో ఉన్న నిధులతో రూ.250 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ రెండు ఫైల్స్ పై మంత్రి శ్రీనివాస్ తొలి సంతకాలు చేశారు.

మంత్రి శ్రీనివాస్‌కు పలువురు అభినందనలు

బాధ్యతలు చేపట్టిన రాష్ట్రమంత్రి శ్రీనివాస్‌కు ప్రిన్సిపల్ కార్యదర్శి శశి భూషణ్ కుమార్,పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్, విజయనగరం ఎం.పి. కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతి, ఎమ్మెల్యే వర్మ, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్‌పి, ఎమ్మెల్యేలు

సమయపాలన పాటించకపోతే చర్యలు

మున్సిపల్ కమిషనర్‌పై మంత్రి సంధ్యారాణి ఫైర్

ప్రజాశకిత - సాలూరు

ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. గురువారం ఆమె స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.30గంటలు దాటినా కమిషనర్‌తో సహా ఉద్యోగులెవరూ కార్యాలయంలో లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కార్యాలయానికి చేరిన కొద్దిసేపటికి కమిషనర్ ప్రేమప్రసన్నవాణి చేరుకున్నారు. కమిషనరే సమయానికి విధులకు రాకపోతే మిగిలిన సిబ్బంది ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. పట్టణంలోని నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు ఎంతవరకు వచ్చాయని మంత్రి సంధ్యారాణి కమిషనర్‌ను ప్రశ్నించారు. తాను ఆదేశించి ఐదు రోజులైనా ఇంతవరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులకు అంచనా వేసినట్లు కమిషనర్ చెప్పారు. కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా వున్నాయని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సంధ్యారాణి కమిషనర్‌ను ఆదేశించారు.

బాలికల కళాశాలగా ఉన్నత పాఠశాల

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను బాలికల కళాశాలగా మార్చ నున్నట్లు మంత్రి సంధ్యారాణి చెప్పారు. తొలుత ఆమె ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఎంఇఒ రాజ్ కుమార్‌తో మాట్లాడారు. ఉన్నతపాఠశాలను కళాశాలగా మార్చడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు కళాశాల చేయాలని కొందరు విద్యార్థినులు కోరారని చెప్పారు. అది ఈరోజు త్వరలో కార్యరూపం దాల్చబోతున్నదని చెప్పారు. పాఠశాలకు విశాలమైన స్థలం వున్నందున గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు కొంత స్థలం కేటాయించాలని సూచించారు. ఆమె వెంట పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు కూనిశెట్టి భీమారావు, ముఖీ సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, కౌన్సిలర్లు తర్లాడ లక్ష్మోజీ, వైదేహి కృష్ణ, మాజీ కౌన్సిలర్ అల్లు అప్పయ్యమ్మ వున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు చేపడుతున్న మంత్రి సంధ్యారాణి

మంత్రి సంధ్యారాణిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కోలక

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మాజీ ఎమ్మెల్యే కోలక లక్షణమూర్తి ఆమె నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిఒ 3కి చట్టబద్ధత కల్పిస్తూ గిరిజన ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటిడిఎలో ప్రత్యేక డిఎస్‌సి, నాన్‌షెడ్యూల గ్రామాలుగా ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా మార్చాలని, జిసిసికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించి అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి ఆ సంస్థ ద్వార గిరిజనులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి తోడ్పాటు అందిచేందుకు జీడి పిక్కల ప్రోసెసింగ్ యూనిట్లు స్థాపించాలని కోరారు. ఆయనతో ఆదివాసీ హక్కులు పరిరక్షణ వేదిక సభ్యులు జానకిరావు, సీతయ్య ఉన్నారు.

24 నుంచి ప్రజా ఫిర్యాదులు స్వీకరణ : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ నెల 24 నుంచి ప్రతీ సోమవారం ప్రజల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులు స్వీకరిస్తామని ఎస్‌పి ఎం. దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతీ సోమవారం యధావిధిగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను ఏర్పాటు చేసామన్నారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

మొక్కల తొలగింపు అన్యాయం

బొబ్బిలి : ప్రభుత్వ ఐటిఐ ఆవరణలో గాంధీ బొమ్మ వద్ద ఉన్న మొక్కలను తొలగించడం అన్యాయమని ఐటిఐ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట్ల శ్రీనివాసరావు అన్నారు. పదేళ్ల క్రితం గాంధీ బొమ్మ చుట్టూ అప్పటి ప్రిన్సిపల్ అప్పలనాయుడు సహకారంతో మొక్కలు నాటి సంరక్షిస్తే నేడు పూర్తిగా తొలగించడం సరికాదని తెలిపారు. మళ్లీ మొక్కలు నాటి పెంచడం ఎంత కష్టమో తెలుసుకోవాలని హితవుపలికారు. మొక్కలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

బాడంగి : మండలంలో రేజేరు గ్రామంలో గురువారం బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సాయం చేశారు. సుంకరి తవిటినాయుడు ఎద్దు పిడుగుపాటుకి గురై మరణించడంతో రూ.20 వేలు సాయం అందజేశారు. బొమ్మినేని శ్రీనివాసరావు క్రషర్ అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో రూ.15 వేలు అందించారు. బి.అప్పలనాయుడు, రాము క్రషర్లు అగ్ని ప్రమాదానికి గురవడంతో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున సాయం చేశారు.

వంద ఎకరాల్లో ఉద్యానవనాల అభివృద్ధికి ప్రణాళికలు

రామభద్రపురం : మండలంలో ఉపాధిహామీ కింద ఈ ఏడాది వంద ఎకరాల్లో ఉద్యానవనాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని ఎంపిడిఒ ఈశ్వరమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 30 ఎకరాల్లో మొదటి విడతగా హార్టికల్చర్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎకరాకు రూ.లక్షా 13 వేలు చొప్పున ఖర్చు చేయనున్నామని తెలిపారు. అలాగే వంద రోజుల పని పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జూన్ 1న యోగా దినోత్సవం సందర్భంగా కొండకెంగువ గ్రామంలో అమృత సరోవర్ బ్యాంకు వద్ద పనులు చేపట్టి యోగాసనాలు వేయనున్నామని తెలిపారు. సమావేశంలో ఎపిఒ గొలగాని త్రినాధరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వంగర : మండలంలోని గీతనాపల్లి గ్రామానికి చెందిన పనస అప్పలస్వామి నాయుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో వారి కుమారుడు పనస పైడిరాజు (గ్రే గ్రౌండ్ పోలీస్) ను రాజాం నియోజకవర్గం టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి గురువారం పరామర్శించారు. మండలంలోని బంగారు వలసకు చెందిన యలగాడ పారమ్మ (65) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో వారి కుమారులు యలగాడ కుమార్, యలగాడ జాన్‌లను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డి.రాంబాబు, దళిత సంఘాల జెఎసి నాయకులు మజ్జి గణపతి రావు, చిత్తిరి గంగులు, కె.బుజ్జి, చిన్న, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

రామభద్రపురం : స్థానిక తహశీల్దార్ సులోచనారాణి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయాన్ని అలంకరించి సిబ్బంది సందడి చేశారు. నిరంతం ప్రజాసేవలో ఉంటూ సత్వర సేవలు అందజేసిన ఉద్యోగులను గుర్తించి వారి సేవలకు సత్కారాలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సులోచనారాణి మాట్లాడుతూ ప్రతి యేటా జూన్ 20న రెవిన్యూ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇక్కడ పనిచేస్తూ విశిష్ట ప్రతిభ కనబరిచిన పలువురు సిబ్బందికి సత్కారాలు చేస్తున్నామన్నారు.

సమర్థవంతంగా 'నేను బడికి పోతా'

నెల్లిమర్ల : నేను బడికి పోతా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రామతీర్థం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్‌ఆర్‌ఎల్ శాస్త్రి అన్నారు. గురువారం రామతీర్థం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలతో నేను బడికి పోతా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. వాలంటీర్ సహాయంతో బడి బయట పిలలను నమోదు చేసి బడిలో చేర్పించాలన్నారు. స్టూడెంట్ కిట్లు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

గోవులను సంరక్షించాలని వినతి

బొండపల్లి : గోవులను సంరక్షించాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ ఆధ్వర్యాన గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి అందించారు. పెదమానాపురం సంత నుండి నిత్యం లారీలు, వ్యాన్లలో పశువులను అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ఆయన ఆరోపించారు. అధికారులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షులు చోళ్ళ రాజకుమారి, పట్టణ అధ్యక్షులు మద్దిల సోంబాబు, కార్యదర్శి రెడ్డిపల్లి రవిశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నీలాపు దేవి, ఉప్పాడ పైడితల్లి, సోము మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న రాకోటి రాములు, దళిత, గిరిజనులు

ప్రజాశక్తి-మెంటాడ

దళిత, గిరిజనుల సాగులో ఉన్న భూములకు పూర్తిస్థాయిలో పట్టాలివ్వాలని ఎపి కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యాన గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలో పోడు, బంజరు భూముల్లో ఎన్నో ఏళ్లుగా దళితులు, గిరిజనులు సాగులో ఉన్నారని తెలిపారు. వీటికి పట్టాలివ్వాలని అనేకమార్లు పోరాటాలు చేయడంతో సుమారు వెయ్యి మందికి గాను 500 మందికి సర్వే చేశారని గుర్తుచేశారు. మండలంలో ఆగూరు, జిటిపేట, ఆంధ్ర, లోతుగెడ్డ, కొండలింగాలవలస, జయితి, జక్కువ, తదితర గ్రామాల్లో భూబాధితులు ఉన్నారని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి నిరుపేదకు పట్టాలివ్వాలని డిమాండ్‌చేశారు. అసైన్ మెంట్ కమిటి ఏర్పాటైన తరువాత పట్టాలిస్తామని తహశీల్దార్ బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామరాపల్లి సోములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మంగళగిరి అప్పలనరసయ్య, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ పిహెచ్‌సిని గురువారం డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు ఆకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పిహెచ్‌సి పరిధిలో ఉన్న పిట్టాడ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. బిసిజి వ్యాక్సిన్ వేస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిజి వ్యాక్సిన్ గూర్చి ప్రచారం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోగులపట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు లోకప్రియ, కల్పన, సిహెచ్‌ఒ ఎస్.సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ తాడ్డి మన్మథరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బిసిజి వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-బాడంగి

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని మండలంలోని పినపెంకి పంచాయతీ గదబవలస గ్రామానికి చెందిన గిరిజనులు సిపిఎం ఆధ్వర్యాన గురువారం తహశీల్దార్‌కు వినతి అందించారు. గ్రామంలో గతంలో ఉన్న శ్మశానవాటిక నది తీవ్రతతో కొట్టుకుపోయిందని గిరిజనులు తెలిపారు. ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలం ఉందని, దాన్ని కొంతమంది ఆక్రమించుకుని, మోటారు ఏర్పాటుచేసి సాగుచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఉన్న మోటార్‌ను తొలగించి, శ్మశానవాటికకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేష్, గిరిజనులు పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు సురేష్, గిరిజనులు

పారిశుధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతర పర్యవేక్షణ ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. గురువారం 11వ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోషాసుపత్రి, అశోక్ నగర్, బూడి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సంబంధిత పారిశుధ్య పర్యవేక్షకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వీధుల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యదర్శులు, సిబ్బంది కలసి ప్రజలలో మరింత చైతన్యం తీసుకొచ్చి చెత్తాచెదారాలు బహిరంగంగా పడవేయకుండా చూడాలని తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఎంఎం నాయుడు

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మాదక ద్రవ్యాల వినియోగంతో ఎంతోమంది జీవితాలు నాశనమవుతున్నాయని ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ పి.కుమార్, ఎస్ఐ కె.కల్యాణి తెలిపారు. స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం వల్ల ఎన్నో కుటుంబాలు నాశన మౌతున్నాయని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల పిఒలు ఎల్.సంధ్య, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ కుమార్

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివి, జాకేరులో ప్రాథమికోన్నత, కుంపల్లి పరిధిలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఇఒ బాలభాస్కరరావు పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చిన పాఠ్య పుస్తకాలు, పాఠశాలల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్‌ఒ కిరణ్మయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తారక్‌నాథ్ కృషి అమోఘం

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆలిండియా భారతీయ స్టేట్ బ్యాంకు ఉద్యోగ సంఘాల ముఖ్య నాయకులు కామ్రేడ్ తారక్ నాథ్ బ్యాంకు ఉద్యోగుల పురోభివృద్ధికి ఎనలేని కృషి చేశారని బ్రాంచ్ మేనేజర్ బెలగాం హరీంద్ర తెలిపారు. స్థానిక బ్రాంచి ఆవరణలో ఆ యూనియన్ నేత నంది హరికృష్ణ ఆధ్వర్యంలో తారక్‌నాథ్ 20వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తారక్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హరీంద్ర మాట్లాడుతూ తారక్‌నాథ్ బాటలో ప్రతీ ఉద్యోగి నడుచుకొని సంఘాల పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, సిబ్బంది శ్రావణి, ధర్మారావు, బిసి పాయింట్ నిర్వాహకులు పివి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

తారక్‌నాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాంచి మేనేజర్ హరీంద్ర, సిబ్బంది

'గురుదేవ్' సేవలు వెలకట్టలేనివి సిఐ చంద్రశేఖర్

ప్రజాశక్తి-కొత్తవలస

వికలాంగులకు గురుదేవ్ చాటిబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొత్తవలస సిఐ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మంగళపాలెం వద్దనున్న శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సుమారు వెయ్యి మంది వికలాంగులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఇటువంటి సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం వికలాంగులకు టీషర్టులు, టోపీలు పంపిణీ చేశారు. అంధులకు పింఛన్లు, వృద్ధులకు రేషన్ అందించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు ప్రసాద్, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

టీషర్టులను అందజేస్తున్న సిఐ బి.చంద్రశేఖర్

నేరాలు ఘోరాలు

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో నడుపూరు గ్రామంలో కర్రోతు కళావతి (40) పాముకాటుతో గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. కళావతి పశువుల కోసం గడ్డి కోసేందుకు పోలానికి వెళ్ళింది. పొలంలో గడ్డి కోసే సమయంలో పాము కాటుకు గురైంది. స్థానికులు వెంటనే ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడకు వెళ్లే లోపలే ఆమె మరణించింది. కళావతికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గుర్ల ఎస్ఐ భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేధిస్తున్నాడని భర్తపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కొత్తవలస

వేధింపులకు పాల్పడుతున్న భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ సంఘటన కొత్తవలసలోని డ్రైవర్స్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పి.సన్యాసిరావు, ప్రమీల దంపతులు.. ఆర్మీలో పనిచేస్తూ 2006లో సన్యాసిరావు ఉద్యోగ విరమణ పొందాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల కాలంలో ప్రమీలను భర్త వేధిస్తున్నాడు. ఏప్రిల్ 30న హత్యాయత్నానికి పాల్పడినట్లు, ఇనుప రాడ్‌తో కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ సుదర్శన్ తెలిపారు.

BEFORE THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
O.S.No.670/2021

Between:
Boni Rama Rao ....Plaintiff
And:
1. Vadaga Venkata Kumari
2. Vadaga Harish Kumar...Defendants

TO
DEFENDANT No.2: Vadaga Harish Kumar, S/O.late Chittibabu, D.No.9/9/85/4, West Baliji Street, Vizianagaram.

NOTICE

Please take notice that the above matter is posted to **dt.23-07-2024** for notice to the defendant No.2. So, you should appear in person or through an Advocate at **10-30 a.m.,** on the above said date before the said court. If you fail to appear before the said court on the said date, the matter will be decided in your absence and set you exparte.

By Order of the Court.
Sri DASARI ESWARA RAO
Advocate for the Plaintiff
Palli Veedhi
VIZIANAGARAM
ANDHRA PRADESH
Ph: 94401 93118